క్లుప్తంగా

మాజీ సర్పంచ్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి తండ్రి, మాజీ సర్పంచ్ తీగల సత్యనారాయణరెడ్డి దశదిన కర్మకు శనివారం మంత్రి సబితారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, స్థానిక నాయకులు అనిల్‌యాదవ్, దీప్‌లాల్ చౌహాన్, రాజ్‌కుమార్, కృష్ణ, బాలమణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న దళితులు

బడంగ్‌పేట్: దావుత్‌ఖాన్‌గూడలోని సర్వే నంబర్‌-2లో మా భూములు మాకు కావాలని దళిత కుటుంబాలు చేస్తున్న నిరసన దీక్షలు శనివారంతో 34వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా కందుకూర్ ఆర్డీఓ కార్యాలయంలో మా భూమి మాకు చెందేలా హక్కులు కల్పించాలని దళిత కుటుంబాలు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ముత్యాలు, రమేష్, ఉమాకాంత్, జ్ఞానేశ్వర్, రాజ్‌కుమార్, లక్ష్మమ్మ, అండాలు, జ్యోతి తదితరులున్నారు.

సుందరంగా బాలాపూర్ చెరువు

డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్



బాలాపూర్ పెద్ద చెరువును సందర్శించిన ఇబ్రాంశేఖర్

బడంగ్‌పేట్: చెరువుల సుందరీకరణతో బాలాపూర్ పెద్ద చెరువు రూపురేఖలు మారిపోయాయి. అందంగా ముస్తాబు అయిందని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. శనివారం పెద్ద చెరువు సుందరీకరణ పనులను ఇబ్రాంశేఖర్ పరిశీలించాడు. హెచ్ఎండీఏ నిధులతో సుందరీకరణ పనులు పూర్తి కావచ్చాయని త్వరలో మంత్రి సబితారెడ్డి చేతుల మీదిగా ప్రారంభోత్సవం చేస్తామని ఆయన వెల్లడించారు. పెద్ద చెరువు సుందరీకరణకు నిధులు వెచ్చించి అభివృద్ధికి సహకారం అందిస్తున్న సబితారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాబురావు, నర్సింగ్‌రావు, రజినికాంత్, సుదర్శన్, జ్ఞానేశ్వర్, బలవంత్, కృష్ణ, యాదయ్య, శ్రీకాంత్, బాను తదితరులున్నారు.

అడ్డురాని వైకల్యం

ఉత్తమ ఉపాధ్యాయుడిగా దస్తగిరి



మహ్మద్ గులాం దస్తగిరి

షాబాద్‌షరీఫ్: అంగవైకల్యాన్ని అధిగమించి ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయుడు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డుకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో పహాడీషరీఫ్ జడ్పీహెచ్‌కు ఉర్దూ మీడియం సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు మహ్మద్ గులాం దస్తగిరి ఎంపిక కావడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శంషాబాద్‌కు చెందిన దస్తగిరి 2004వ సంవత్సరంలో ఎస్‌జీటీగా ఉద్యోగం సాధించాడు. నేదునూర్, శంషాబాద్, మోమిన్‌పేట్‌లో పనిచేశారు. ప్రస్తుతం పహాడీషరీఫ్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. తన ప్రతిభను గుర్తించి ఈ అవార్డును అప్పగించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల విజిట్‌కు విచ్చేసిన పలుమార్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి సైతం తనకు అభినందనలు తెలియజేశారని ఈ సందర్భంగా ఆయన సాక్షి తో తన మధుర స్మృతులను పంచుకున్నారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా 15, వంకాయ 18, బెండ 23, పచ్చిమిర్చి40, కాకర 20, బీర 18, క్యాలీఫ్లవర్ 23, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 23, ఆలు 21, ఉల్లి 29, గోకర 28, దోస 18, సొర 11, పొట్ల 18, అరటి 11, చిక్కుడు 45, అర్వి 32, మునగ 28, చిలగడదుంప 45, బీట్‌రూట్ 21, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 40, కాప్సికమ్ 31. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సంక్షేమ సారథికి నివాళి

దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలతో ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. వైఎస్ సేవలు మరువలేనివని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, జలయజ్ఞం, రిజర్వేషన్లు వంటి పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో మరపురానినేతగా మిగిలారని పలువురు ప్రశంసించారు.



మహేశ్వరం : వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు



నాదర్‌గుల్‌లో వైఎస్సార్ వర్ధంతిలో యూత్ కాంగ్రెస్ నాయకులు



అల్మాస్‌గూడ: వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిలో కాంగ్రెస్ నాయకులు



కందుకూరు: వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న అభిమానులు



బడంగ్‌పేట: దివంగత నేత వైఎస్ వర్ధంతిలో పాల్గొన్న మేయర్ పారిజాత

పెద్దచెరువు తూము కబ్జా

- చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి రవిమాదిగ

బడంగ్‌పేట్: కోట్లాది రూపాయలతో పెద్ద చెరువును సుందరీకరణ చేస్తుంటే మరోవైపు కొందరు అక్రమార్కులు బఫర్ జోన్‌లో చెరువు తూము, కుంటలను కబ్జాలు చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధికార ప్రతినిధి బొర్ర రవిమాదిగ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. బాలాపూర్‌కు చెందిన కొంతమోని కుంటలో రెండు ఎకరాల మేరకు స్థానిక కాంగ్రెస్ ప్రజాప్రతినిధి, మరో కార్పొరేటర్ అండతో కాంగ్రెస్ నాయకులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో అక్రమంగా వెంచర్ చేసి ప్లాట్లు చేసి ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి సబితారెడ్డి పెద్ద చెరువును కోటి రూపాయలతో అందంగా తీర్చిదిద్దుతుంటే మరో వైపు తూములు కబ్జాలు చేసి షెడ్లు వేస్తున్నారని వాపోయారు. ఇరిగేషన్ ఏఈకు ఫిర్యాదు చేయగా కుంటను మట్టితో పూడ్చిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని బడంగ్‌పేట కమిషనర్‌కు, బాలాపూర్ తహసీల్దార్‌కు లేఖ అందించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.



పెద్ద చెరువుతూమును ఆనుకుని నిర్మిస్తున్న ఇళ్లు

ఆర్థిక సాయం అందజేత

మహేశ్వరం: ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం చేసి ఆదుకుంటానని మండల బీఆర్ఎస్ నాయకులు పాత్లావత్ రఘునాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నాగారం గ్రామ పంచాయతీ ఎన్నుచెర్వు తండాకు చెందిన గొర్రెల కాపరి లక్ష్మణ్‌నాయక్‌కు చెందిన ఐదుగొర్రెలు ఇటీవల విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. దీంతో వారి కుటుంబానికి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో లక్ష్మణ్ నాయక్‌కి చెందిన ఐదు గొర్రెలు దుర్మరణం చెందడం తనని బాధించిందన్నారు. భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న రఘునాయక్

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

సిద్దాల బీరప్ప

మీర్‌పేట: విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని లార్డ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ సిద్దాల బీరప్ప సూచించారు. శనివారం మీర్‌పేట జిల్లెలగూడ లార్డ్స్ స్కూల్‌లో నిర్వహించిన పోషకాహార దినోత్సవానికి బీరప్ప ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యంగా ఉండాలంటే పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. క్యాన్సర్ మహమ్మారిని తరిమికొట్టేందుకు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. అనంతరం పౌష్టికాహారంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్ కుమార్, ఇన్‌చార్జి జ్యోతిర్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పౌష్టికాహార దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనాథాశ్రమానికి విద్యార్థుల చేయూత

బడంగ్‌పేట్: మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు శనివారం బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి చేయూత అందించారు. రెండు క్వింటాళ్ల బియ్యం, 20 కేజీల కందిపప్పు, నిత్యావసర సరుకులు అందజేశారు. నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పాఠశాలలో చారిటీడేను నిర్వహించారు. చిన్నారులకు సమాజం పట్ల అవగాహన కల్పించి వారిని ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దాలని విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నారులకు వ్యక్తిత్వ వికాసానికి తమ విద్యాసంస్థలో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డి.మహేష్, ఇన్‌చార్జి దుర్గా, సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాతృదేవోభవ ఆశ్రమానికి వితరణ చేస్తున్న విద్యార్థులు

పాఠశాల పరిసరాలు శుభ్రం చేసిన పోలీసులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరిసరాలను శనివారం కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా ఆమనగల్లు ఎస్ఐ బాల్‌రాం, సిబ్బంది శుభ్రం చేశారు. అంతకు ముందు పాఠశాలలో పెరిగిన చెట్లను జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ , పీఈటీ సుశీల తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

కడ్తాల్: కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు డాక్టర్ చల్లా వంశీచంద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకుడు జంగయ్యను పరామర్శించారు. ఆయనకు వైద్య ఖర్చులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎంపీటీసీ రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

డిమాండ్లను నెరవేర్చాలి

ఆమనగల్లు: సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఆ సంఘం జిల్లా కోశాధికారి సాయికుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆమనగల్లు ఎమ్మార్పీ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు ఎంఈఓకు వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం పెంచాలని కోరారు.

గోలి శ్రీనివాస్‌రెడ్డికి సత్కారం

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన గోలి శ్రీనివాస్‌రెడ్డిని శనివారం దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. హైదరాబాద్‌లో ఆయనను జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు శంకర్, మాడ్గుల మండల సంఘం అధ్యక్షుడు సత్యానారాయణగౌడ్, తలకొండపల్లి మండల సంఘం అధ్యక్షుడు మల్లేశ్ ఘనంగా సత్కరించారు.

చదువుతోనే భవిష్యత్తు

తలకొండపల్లి: ఉన్నత చదువుతో భవిష్యత్తుతో పాటు సమాజంలో గౌరవం పెరుగుతుందని లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్ అధ్యక్షుడు బుచ్చన్న అన్నారు. లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఎవరెస్ట్ ఆధ్వర్యంలో ఖానాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బుచ్చయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో వాటర్ ట్యాంక్‌ను అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, స్కూల్ కమిటీ చైర్మన్ జగన్, చిత్తరంజన్ దాస్, శారద, సతీష్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న బొడ్రాయి (నాభిశిల), పోతలింగన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 5వ తేదీ వరకు నిర్వహించే ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం గణపతి పూజ, ప్రతిష్ఠ మహాసంకల్పం, అంకురార్పణ, పుణ్యాహవాచనం, సప్తమాతృక పూజ, పంచగవ్య ప్రాచనం, యాగశాల ప్రవేశం, నవగ్రహ, యోగిని, వాస్తు, క్షేత్రపాలక సర్వతోభద్ర మండప ఆవాహనం, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసము, మూలమంత్ర హవనం, షోడశోపచార పూజలు, మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆవాహిత దేవత పూజలు, గ్రామ ప్రజలచేత అభిషేకం, చండిసప్త శతీ మరియు రుద్ర హవనం, పుష్పధాన్య, శయ్యాధివాసము నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం జరిగిన హోమం కార్యక్రమంలో కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, విద్యావిజయేందర్ రెడ్డి, సహకార సంఘం డైరెక్టర్లు మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దండెం నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న కౌన్సిలర్లు తదితరులు

ప్రతి విద్యార్థి కరాటే నేర్చుకోవాలి

ఆమనగల్లు: ప్రతి విద్యార్థి ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని తలకొండపల్లి జెడ్పీటీసీ దశరథ్ సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో హైస్కూల్‌లో శనివారం కరాటే మాస్టర్ సోను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కరాటే తరగతులను జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటాపాటల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు పత్యానాయక్, రాంనుంతల సర్పంచ్ శ్రీనునాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'డబుల్' ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

- 15 రోజుల్లో రెండో విడత పంపిణీ చేస్తాం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పారదర్శంగా నిర్వహించామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మొదటి విడితగా 500 మంది లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేసిన అధికారులు శనివారం వారికి ఇళ్లు అందజేశారు. ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం నుంచి ప్రతాప్‌సింగారం వరకు లబ్ధిదారులను తీసుకెళ్లడానికి ఏర్పాటు చేసిన ఉచిత బస్సులను ఆయన ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గానికి సుమారు 4752 డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. ఎవరు ఎన్ని విమర్శలు చేసినా తెలంగాణ ప్రభుత్వం పేదలకు నీడ కల్పించడమే ధ్యేయంగా పెట్టుకొని డబుల్ బెడ్రూమ్ ఇళ్లతో పాటు సొంత స్థలం ఉన్నవారు ఇళ్లు నిర్మించుకొనేందుకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ. 3 లక్షలు అందిస్తోందన్నారు. అర్హులైన పేదలకు విడితల వారీగా ఇళ్లు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీలు రవీందర్, దశరథ్, మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌కుమార్, నాయకులు ఆనంద్‌కుమార్‌గౌడ్, బేర బాలకిషన్, శ్రీశైలంయాదవ్, మహేందర్‌యాదవ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఇళ్ల లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, సర్కిల్ అధికారులు

◆ ఇలా ఉండగా, ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్న తమ సొంతింటి కల ఇప్పుడు నెరవేరిందని పలువురు మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. సంక్రాంతి, దీపావళిలా తమకు ఇది ఒక పండుగ రోజు అని అన్నారు. ఇంకా వారేమన్నారంటే...

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి

సైదాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తున్నారని బీఆర్ఎస్ యాకుత్‌పురా నియోజకవర్గ ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అన్నారు. శనివారం సైదాబాద్ మండల కార్యాలయం వద్ద ఐఎస్‌సదన్ డివిజన్ నుంచి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు మంజూరైన వారితో ఆయన మాట్లాడారు. ఐఎస్‌సదన్ డివిజన్ నుంచి మొత్తం 58 మందికి మహేశ్వరం మండలం మంకాల గ్రామంలో ఇళ్లు మంజూరయ్యాయి. వారిని ఆర్టీసీ బస్సుల్లో సైదాబాద్ మండల కార్యాలయం నుంచి మంకాలలోని ఇళ్ల వద్దకు ఆయన తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిచి కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని సుందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



సైదాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద లబ్ధిదారులతో సామ సుందర్‌రెడ్డి

"సొంతింటి కల నెరవేరింది



నాలుగేళ్ల క్రితం డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ఎప్పుడో రావల్సిన ఇల్లు ఇప్పుడు చేతికొచ్చింది. ఎన్నో ఏళ్ల మా సొంతింటి కల నేడు నెరవేరింది. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. పైసా ఖర్చులేకుండా మాకు ఇళ్లు ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది ఈ రోజు. కేసీఆర్‌సార్‌కు కృతజ్ఞతలు.

– మంగలక్ష్మి, వనస్థలిపురం

ఎప్పుడెప్పుడా అన్ని చూశాం



డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం మేము దరఖాస్తు చేసి నాలుగేళ్లు దాటింది. అప్పటి నుంచి ఎప్పుడెప్పుడా అని ఇంటి కోసం చూశాం. ఒక దశలో అది వస్తుందనే ఆశ కూడా లేకుండాపోయింది. చివరకు ముఖ్యమంత్రి కేసీఆర్ తమ ఆశను నెరవేర్చారు. తాము జీవితాంతం ఆయనకు రుణపడి ఉంటాం.

–ఊశమ్మ, చంపాపేట

ఆనందంగా ఉంది



ఈ రోజు మా కుటుంబం ఆనందంగా ఉంది. డబుల్ బెడ్రూమ్ ఇంటి కోసం ఎంతగానో తపన పడ్డాం. ఈ రోజు ఆ కల నెరవేరింది. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగలా ఈ రోజు మాకొక పండుగ రోజు. పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా ఇళ్లు ఇచ్చింది. జీవితాంతం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– ప్రశాంతకుమారి, వనస్థలిపురం